www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 3 ఏప్రిల్ 2023 | 5 | పశ్చిమ గోదావరి



4న స్త్రీలకు ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరం

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 4న మంగళవారం స్థానిక క్షత్రియ కళ్యాణ మండపంలో స్త్రీలకు ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షా శిబిరం నిర్వహిస్తున్నట్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పి.బుద్ధరాజు, క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు భూపతిరాజు విశ్వనాథరాజు, కార్యదర్శి డాక్టర్ కెఎస్‌పిఎన్.వర్మ తెలిపారు. వసుధ ఫౌండేషన్, పాలకొల్లు క్షత్రియ సంక్షేమ పరిషత్ సహకారంతో, విజయవాడ మణిపాల్ హాస్పిటల్ సౌజన్యంతో ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరంలో కేన్సర్‌కు సంబంధించిన మెమోగ్రఫీ, ప్యాప్ స్మియర్, ఇసిజి, ర్యాండమ్ బ్లడ్ షుగర్, బిపి జనరల్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని పాలకొల్లు పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు.

మహిళా పోలీసులకు జాబ్‌చార్ట్ ఉందా?

నిబంధనలకు విరుద్ధంగా గ్రామాలు దాటి విధుల కేటాయింపు
పలుచోట్ల మహిళా పోలీసులపై సిఐ, ఎస్ఐల తీరు దారుణం
అర్ధరాత్రి వరకు బందోబస్తు, ఆదివారం, పండుగ దినాల్లోనూ విధులు
ప్రశ్నిస్తే షోకాజ్ నోటీసుల పేరుతో బెదిరింపులు
ఐదు గంటల వరకూ సచివాలయంలో.. ఆపై బందోబస్తు పనులు
తల్లడిల్లుతున్న మహిళా పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న మహిళా పోలీసులకు (మహిళా సంరక్షణ కార్యదర్శులు) అసలు జాబ్‌చార్ట్ ఉందా.. వీరికి విధుల కేటాయింపు నిబంధనల ప్రకారం జరుగుతుందా.. పోలీస్ ఉద్యోగుల మాదిరిగా అర్ధరాత్రి వరకూ బందోబస్తు విధులు, ఆదివారం, పండుగ దినాల్లో విధులు కేటాయించొచ్చా.. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ సచివాలయంలో పని చేసిన మహిళా సంరక్షణ కార్యదర్శులకు ఐదు గంటల తర్వాత విధులు కేటాయించొచ్చా వంటి పలు ప్రశ్నలకు సమాధానం లేకుండాపోయింది.

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 900కుపైగా గ్రామ సచివాయాలు ఉన్నాయి. ప్రతి గ్రామ సచివాలయానికి ఒక మహిళా సంరక్షణ అధికారిని ప్రభుత్వం నియమించింది. వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్లు మాదిరిగానే వీరు కూడా పరీక్షలు రాసి ఈ ఉద్యోగంలో చేరారు. మహిళా సంరక్షణ కార్యదర్శులు చేయాల్సిన విధుల గురించి ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. గ్రామ సచివాలయ పరిధిలో నేరాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీస్ స్టేషన్‌లకు ఇవ్వడం, మహిళలకు సంబంధించిన కేసులు సచివాలయ పరిధిలో జరిగితే హాజరుకావడం, సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీలను సందర్శించడం, ప్రభుత్వ స్కూళ్లకు వెళ్లి చట్టాలపై అవగాహన కల్పించడం, గ్రామస్తులకు చట్టాల గురించి తెలియజేయడం వంటి విధులున్నాయి. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో వీరు పని చేయాల్సి ఉంటుందని పేర్కొంది. వీరికి సంబంధించి డిడిఒ అధికారం కూడా పంచాయతీ కార్యదర్శికే ఉంది. తర్వాత కాలంలో వీరికి యూనిఫారం ఇచ్చి పోలీస్ సిబ్బందిగా పరిగణించాలని ప్రభుత్వం ప్రయత్నించింది. కొంతమంది కోర్టుకు వెళ్లడంతో ప్రభుత్వం ఆ జిఒను వెనక్కి తీసుకుని యూనిఫారం వంటి వాటిని విరమించుకుంది. ఇంకా కోర్టులో ఈ కేసు విచారణలో ఉంది. ఎందుకంటే మహిళా సంరక్షణ అధికారులు పోలీస్ ఉద్యోగానికి సంబంధించిన ఎటువంటి ఫిజికల్ టెస్టులు పాస్ కాలేదు. వీరు సచివాలయ పరిధిలో ఉద్యోగాలు పొందినవారు మాత్రమే. అంతర్ జిల్లాల బదిలీలు లేక భార్యాభర్తలు వేర్వేరు చోట్ల ఉద్యోగాలు చేస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళా సంరక్షణ కార్యదర్శులు పెద్దసంఖ్యలో ఉన్నారు.



నిబంధనలకు విరుద్ధంగా విధులు..?

మహిళా సంరక్షణ కార్యదర్శులు ఉదయం పది గంటలకు సచివాలయానికి వెళ్లి బయోమెట్రిక్ వేయాలి. సాయంత్రం ఐదు గంటలకు డ్యూటీ ముగిసిన తర్వాత వీరిని పోలీస్ స్టేషన్లకు పిలిచి విధులు కేటాయిస్తున్నారు. నిబంధనల ప్రకారం గ్రామ సచివాలయ పరిధి దాటి విధులు కేటాయించకూడదని నిబంధనలు చెబుతున్నాయి. ఎందుకంటే వారికిచ్చిన ఉద్యోగమే గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి. అయితే అర్ధరాత్రి వరకూ వేరే ప్రాంతాల్లో బందోబస్తు విధులు కేటాయిస్తున్నారు. కాదంటే షోకాజ్ నోటీసులిచ్చి సిఐలు, ఎస్ఐలు బెదిరిస్తున్నారు. ప్రతిరోజూ మండలంలోని ఇద్దరు మహిళా పోలీసులకు పోలీస్ స్టేషన్‌లో విధులు వేస్తున్నారు. మరోపక్క తమకు చెప్పకుండా ఎలా వెళ్తారంటూ పంచాయతీ కార్యదర్శుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. అధికారికంగా ఉత్తర్వులు ఇవ్వాలని కోరితే సిఐలు, ఎస్ఐలు ఇవ్వడం లేదు. ప్రస్తుతం మహిళా పోలీసులకు సచివాలయ పరిధిలో ఐదు సంవత్సరాల్లోపు పిల్లల జాబితా తయారీ, మిషన్ వాత్సల్య విధులు, ఎస్‌డిజి సర్వే వంటివన్నీ అప్పగించారు. అవన్నీ కాకుండా ఎస్ఐలు, సిఐలు అదనపు విధులు కేటాయిస్తున్న పరిస్థితి ఉంది. 50 కిలోమీటర్ల దూరంలో సిఎం పర్యటన బందోబస్తుకు, ఉద్యోగ రాత పరీక్షా కేంద్రాల విధులకు కూడా మహిళా పోలీసులను వినియోగిస్తున్నారు. అర్ధరాత్రి వరకూ డ్యూటీ చేసి ఉదయం సచివాలయానికి ఆలస్యంగా వస్తే పంచాయతీ కార్యదర్శి ఊరుకోవడం లేదు. దీంతో తమ జాబ్‌చార్ట్ ఏమిటంటూ మహిళా పోలీసులు మదనపడుతున్నారు. ప్రశ్నిస్తే సిఐలు, ఎస్ఐలు మరింత దారుణంగా కక్ష సాధింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో తమ సమస్యలు జిల్లా ఉన్నతాధికారులకు చెప్పాలన్నా మహిళా పోలీసులు భయపడుతున్నారు. మహిళా పోలీసుల జాబ్‌చార్ట్‌పై ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులకు స్పష్టత ఇవ్వకపోతే అధికారుల వేధింపులు రోజురోజుకీ మరింత పెరిగే ప్రమాదం ఉంది.

కోవర్టులను పెట్టి కక్షసాధింపు

'విభజించు పాలించు' అనే బ్రిటీష్ వారి సూత్రాన్ని పలుచోట్ల సిఐలు, ఎస్ఐలు మహిళా పోలీసుల విషయంలో అమలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తమ మాటవింటూ అనుకూలంగా ఉన్న మహిళా పోలీసులతో మిగిలిన వారి సమాచారాన్ని, వాళ్ల మాట్లాడుకునే మాటలను తెలుసుకుని కక్ష సాధింపులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. తమకు కోవర్టులుగా పని చేస్తున్న ఉద్యోగులకు విధుల కేటాయింపుల్లో వెసులుబాటు ఇస్తున్నట్లు సమాచారం.

కొత్త జిల్లాలో సరికొత్త ఫలితాలే లక్ష్యం

పది పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతకు ప్రణాళికాబద్ధంగా కృషి
పరీక్షలకు ఏర్పాట్లన్నీ పూర్తి
నేటి నుంచి 17వ తేదీ వరకు పరీక్షలు
జిల్లాలో 121 కేంద్రాలు ఏర్పాటు
హాజరుకానున్న 24,586 మంది విద్యార్థులు
నిర్వహణలో తప్పు చేస్తే ఇన్విజిలేటర్లపై క్రిమినల్ కేసులు
డిఇఒ ఆర్.వెంకటరమణ



ప్రజాశక్తి - భీమవరం

గతేడాది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పదో తరగతి పరీక్షలు జరిగాయని, జిల్లాల పునర్విభజన అనంతరం కొత్త జిల్లాలో సరికొత్త ఫలితాల సాధనే లక్ష్యంగా సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా కృషి చేశామని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. పదో తరగతి పరీక్షల నిర్వహణ, పరీక్షా కేంద్రాల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన, సిబ్బంది నియామకం, ఫలితాల సాధనకు చేసిన కృషి తదితర అంశాలపై డిఇఒ ప్రజాశక్తితో ముచ్చటించారు.



ప్రశ్న: ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు ఏ విధంగా నిర్వహించనున్నారు?

డిఇఒ: గతేడాది ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పరీక్షలు జరిగాయి. ఈ ఏడాది నూతన జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు పక్కా ఏర్పాట్లు చేశాం.

ప్రశ్న: నూరుశాతం ఫలితాల సాధనకు ఎటువంటి చర్యలు చేపట్టారు?

డిఇఒ: నూరుశాతం ఉత్తర్ణత లక్ష్యంతో వంద రోజుల ప్రణాళికను రూపొందించి ప్రత్యేక తరగతులు నిర్వహించాం. 10 మంది విద్యార్థులను ఒక ఉపాధ్యాయుడికి దత్తత ఇచ్చి చదివించేలా ఏర్పాటు చేశాం. అలాగే ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ చదువులో వెనుకబడిన సి, డి గ్రేడుల విద్యార్థులపై దృష్టి సారించాం. ఈ వంద రోజుల కార్యక్రమానికి ఉపాధ్యాయులు అందించిన కృషి ఎనలేనిది.

ప్రశ్న: పరీక్షలు ఎప్పటి నుంచి ప్రారంభం కానున్నాయి?

డిఇఒ: ఈ నెల మూడో తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 17వ తేదీ వరకు కొనసాగుతాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు పరీక్ష జరుగుతుంది. ఉదయం 8:45 నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 9:30 గంటలు దాటాక నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోరు.

ప్రశ్న: **జిల్లాలో ఎన్ని పాఠశాలలున్నాయి. ఎన్ని పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎంతమంది విద్యార్థులు హాజరు** కానున్నారు?

డిఇఒ: జిల్లాలో 376 ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు ఉన్నాయి. 121 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశాం. 24,586 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో 12,929 మంది బాలురు, 11,657 మంది బాలికలు ఉన్నారు.

ప్రశ్న: పరీక్షల నిర్వహణకు ఎంతమంది అధికారులను నియమించారు?

డిఇఒ: జిల్లాలో పరీక్షల నిర్వహణకు 121 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 121 మంది డిపార్టుమెంటల్ అధికారులు, ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 24 మంది రూట్ ఆఫీసర్లను నియమించాం.

ప్రశ్న: సమస్యాత్మక కేంద్రాలను ఏమైనా గుర్తించారా?

డిఇఒ: జిల్లాలో ఆరు సమస్మాత్మక కేంద్రాలను గుర్తించాం. తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను ఎపిఎస్‌డబ్ల్యూఆర్ఎస్, పెంటపాడు మండలం అలంపురం జిల్లా పరిషత్ స్కూల్, ఆచంట మండలం ఎంపీ పాలెం జిల్లా పరిషత్ హైస్కూల్, పాలకోడేరు మండలం శృంగవక్షం జిల్లా పరిషత్ హైస్కూల్, నరసాపురం మండలం సీతారామపురం ఎపిఎస్‌డబ్ల్యూఆర్ఎస్, పెనుమంట్ర జిల్లా పరిషత్ హైస్కూల్‌లను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించాం. వీటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి సిట్టింగ్ స్క్వాడులు నియమించాం.

ప్రశ్న: పరీక్షా కేంద్రాల్లో ఎటువంటి సౌకర్యాలు కల్పించారు?

డిఇఒ: పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా అన్ని ఏర్పాట్లూ చేశాం. ప్రధానంగా తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులతోపాటు విద్యుత్, వైద్య సదుపాయాలను కూడా కల్పించాం.

ప్రశ్న: పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రయాణ సౌకర్యం, కేంద్రాల వద్ద భద్రత ఏమైనా ఏర్పాటు చేశారా?

డిఇఒ: పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టిక్కెట్ చూపించి ఆర్‌టిసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసేలా చర్యలు తీసుకున్నాం. పరీక్షా కేంద్రాలకు వెళ్లే రూట్లలో బస్సులను ఏర్పాటు చేశాం. ముఖ్యంగా పరీక్షా కేంద్రాలకు వంద మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

ప్రశ్న: మాస్ కాపీయింగ్ జరగకుండా ఏమైనా చర్యలు చేపట్టారా?

డిఇఒ: పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం. అయినా పరీక్షల్లో ఎక్కడైనా మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే విద్యార్థులను డిబార్ చేయడం జరుగుతుంది. విద్యార్థితోపాటు పరీక్షా కేంద్రంలోని ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేస్తాం. తప్పు జరిగిందని రుజువైతే సంబంధిత ఉపాధ్యాయులపై 25/97 యాక్ట్ ప్రకారం క్రిమినల్ కేసుల నమోదుకూ వెనుకాడబోము.

ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై

14 నుంచి రాజకీయ ప్రచార ఉద్యమ భేరి

కుంభకోణాలు, అవినీతికి మారుపేరు బిజెపి
సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం
కేంద్రానికి వైసిపి ఊడిగం
సిపిఐ జిల్లా కార్యదర్శి కె.భీమారావు

ప్రజాశక్తి - భీమవరం

కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాల ఫలితంగా పేద, మధ్యతరగతి ప్రజలపై విపరీతమైన భారం పడుతోందని, ఈ విధానాలను వ్యతిరేకిస్తూ రాజకీయ ప్రచార ఉద్యమ భేరి నిర్వహించనున్నట్లు సిపిఎం, సిపిఐ నేతలు వెల్లడించారు. ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు 15 రోజులపాటు జిల్లాలో నిర్వహించబోయే ఈ ప్రచార ఉద్యమ భేరిని అంబేద్కర్ జయంతి రోజున పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ప్రారంభిస్తామని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీల శ్రేణులతోపాటు అభిమానులు, సానుభూతిపరులు, అన్ని తరగతుల ప్రజలు ఉద్యమ భేరిలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అత్యంత దుర్మార్గంగా అవలంబిస్తోందన్నారు. ప్రజల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్పొరేట్లకు అనుకూల విధానాలు అవలంభిస్తూ ప్రజాసంపదను వారికి కట్టబెడుతున్నారన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్లకు లక్షల కోట్లు రాయితీలు, సామాన్య, మధ్యతరగతి ప్రజలపై విపరీతమైన భారాలు మోపారని విమర్శించారు. ప్రజా సంక్షేమానికి చెందిన పద్దులన్నింటికీ కోతలు విధించారన్నారు. రైతులకు రాయితీల కుదింపు, వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనుల్లో కోతలు, ప్రజాపంపిణీ వ్యవస్థకు కోతలతోపాటు ఎరువులు, ఔషధాల ధరలు పెంచేశారన్నారు. విచిత్రంగా విమాన ఇంధన ధరలను తగ్గించి, పేదలు, మధ్యతరగతి ప్రజలు నిత్యం ఉపయోగించే పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు మాత్రం విపరీతంగా పెంచారని విమర్శించారు. కుంభకోణాలకు నిలయంగా అవినీతిలో అగ్రస్థానంలో కేంద్ర ప్రభుత్వం నిలిచిందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కారు చౌకగా అమ్మేస్తోందని విమర్శించారు. నౌకాశ్రయాలను, విమానాశ్రయాలను, రోడ్లను, బ్యాంకులను, ఎల్ఐసి, రైల్వేలను కొల్లగొట్టుకునేలా కార్పొరేట్లకు అప్పగించేస్తోందన్నారు. నిరంకుశంగా ప్రతిపక్షాలపై, ప్రతిపక్ష నేతలపై దాడులు చేస్తోందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు, పోలవరం ప్రాజెక్ట్ నిధులు, నిర్వాసితుల సమస్యలు, రాజధాని నిర్మాణానికి నిధులు, కడప ఉక్కు ఫ్యాక్టరీ విషయంలో తీరని ద్రోహం చేసిందన్నారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల ఊసే లేదన్నారు. నిత్యావసరాల ధరలను అరికట్టడం లేదన్నారు. ఈ సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు మతోన్మాదాన్ని ప్రజల మీదకు ప్రయోగిస్తుందన్నారు. మైనార్టీలు, దళితులు, మహిళలపై దాడులు పెరిగాయన్నారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా వైసిపి ప్రభుత్వం కనీసం నోరు మెదపడం లేదన్నారు. పైగా కేంద్ర ప్రభుత్వం ఏం చెబితే అది చేసే స్థితికి రాష్ట్ర ప్రభుత్వం వచ్చేసిందన్నారు. చివరకు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌గా కాకుండా అదాని, అంబానీప్రదేశ్‌గా మారిపోయే స్థితిలో ఉందన్నారు. ప్రధాన ప్రతిపక్షం టిడిపి, ప్రశ్నిస్తానని వచ్చిన జనసేనగాని కేంద్ర ప్రభుత్వ ద్రోహంపై మాట్లాడకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. కేంద్రం విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం అన్ని పార్టీలనూ కలుపుకుని పోరాడాలన్నారు. ఈ నెల 14 నుంచి నిర్వహించబోయే యాత్రల్లో ప్రజా సమస్యలను సభలు, సమావేశాలు పెట్టి వివరిస్తామన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ తొమ్మిదేళ్లగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఉన్న విశాఖ ఉక్కును సైతం కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేశారన్నారు. నాడు నిత్యావసరాల ధరలు, గ్యాస్ ధరలు తగ్గిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి వాటి మాటే మర్చిపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బిజెపికి ఊడిగం చేయడం తప్ప రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజావసరాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా నాయకులు చెల్లబోయిన రంగారావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, బి.వాసుదేవరావు, కవురు పెద్దిరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు బలరాం, భీమారావు

మెగా డిఎస్‌సి విడుదల చేయాలి

డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.ధనుష్ - నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - భీమవరం


25 వేల ఉపాధ్యాయ పోస్టులతో మెగా డిఎస్‌సి వెంటనే విడుదల చేయాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి జి.ధనుష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలవుతున్నా ఇప్పటికీ ఒక టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. ఎన్నికలకు ముందు 25 వేలు పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పి ఇప్పుడు 711 పోస్టులు మాత్రమే ఖాళీ ఉన్నాయని చెప్పడం యువతను మోసగించడమేనని విమర్శించారు. నాలుగు సంవత్సరాలుగా నిరుద్యోగులు కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరుగుతూ డిఎస్‌సి కోసం పడిగాపులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నియామకాలు చేపట్టకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాలో నిరుద్యోగులు, డిఎస్‌సి అభ్యర్థులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ మద్దతు

మెగా డిఎస్‌సి కోసం డివైఎఫ్ఐ చేపట్టే ధర్నాకు మద్దతు తెలుపుతున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. చాలా పాఠశాలల్లో టీచర్లు లేక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో ఉపాధ్యాయ సిబ్బంది ఉంటేనే ప్రభుత్వ విద్యా సంస్థల్లో నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ధర్నాలో విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారిగా గోపీమూర్తి మళ్లీ ఎన్నిక

ప్రజాశక్తి - భీమవరం



జిల్లాకు చెందిన యుటిఎఫ్ నేత బి.గోపీమూర్తి రెండోసారి యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 1, 2 తేదీల్లో విజయవాడలో జరిగిన యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో ఎన్నిక జరిగింది. గోపీమూర్తి ఎన్నిక పట్ల యుటిఎఫ్ జిల్లా కమిటీ శుభాకాంక్షలు తెలిపింది. గోపీమూర్తిని అభినందించిన వారిలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, గౌరవాధ్యక్షులు ఎం.మార్కండేయులు, సహాధ్యక్షులు కె.రాజశేఖర్, కె.శ్రీదేవి, జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు పి.శివప్రసాద్, టిజె.జయకుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు జివి.రామానుజరావు, సిహెచ్.కృష్ణమోహన్, కేతా వెంకటేశ్వరరావు, డి.పద్మావతి, ఎంవి.రాజశేఖర్ ఉన్నారు.

5న చలో ఢిల్లీ జయప్రదానికి ప్రచారం

ప్రజాశక్తి - పెంటపాడు రూరల్

ఈ నెల 5న చలో ఢిల్లీ జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు, ఎపి రైతుసంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, కౌలురైతు సంఘం ఆధ్వర్యాన జీపు ప్రచార యాత్రను స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద ఆదివారం ప్రారంభించారు. ఈ యాత్రనుద్దేశించి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, నాయకులు బంకురు నాగేశ్వరరావు మాట్లాడుతూ చలో ఢిల్లీ జయప్రదానికి మండలంలో గ్రామగ్రామాన ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోతు శ్రీను, కరక వెంకట్రావు, పెనగంటి దుర్గ, మాదాసు రమేష్, కుసంపూడి చందు, కాటా నరేష్, కె.రవి, వై.వెంకన్న పాల్గొన్నారు.

భీమవరం రూరల్: అధిక ధరలను అరికట్టాలని, ఆహార, నిత్యావసరాలపై జిఎస్‌టి ఉపసంహరించాలని, పెట్రోల్, డీజిల్, వంటగ్యాసులపై ఎక్సైజ్ పన్నులు తగ్గించాలని సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వెంప పెదపేటలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం 5న చలో ఢిల్లీ విజయవంతం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడగా బుంగ దావీదు, కాటికి గోపి, పెద్దిరాజు, మీసరపు ఇసాక్, చంటి, గాంధీ, శాంతారావు పాల్గొన్నారు.



పెంటపాడు మండలంలో ప్రచార యాత్ర

రుణాలు సకాలంలో చెల్లించాలి

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నర్సింహరాజు

ప్రజాశక్తి - ఉండి

రైతులు పొందిన రుణాలను సకాలంలో చెల్లించడం వల్ల సహకార సంఘాలు అభివృద్ధి చెందుతాయని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. ఆదివారం ఉండి విశాల సహకార పరపతి సంఘంలో త్రిసభ్య కమిటీ ఛైర్మన్ పేరిచర్ల సూర్యనారాయణరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పివిఎల్‌తోపాటు ఆకివీడు సహకార బ్యాంక్ బ్రాంచి మేనేజర్ సాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం సహకార కేంద్ర బ్యాంక్ ఆకివీడు బ్రాంచి ద్వారా రైతులకు రూ.ఐదు కోట్లు మల్టీపర్పస్ రుణాలు మంజూరైనట్లు ప్రకటించారు. ఆరుగురు రైతులకు రూ.66.50 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశారు. రైతునేస్తం కింద రూ.రెండు కోట్లు మంజూరవ్వగా రూ.8.95 లక్షలు విలువైన చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ సభ్యులు కరిమెరక శివ నాగరాజు, చిట్టూరి రత్నరాజు, ఉండి ఎంపిపి ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, వైసిపి మండల అధ్యక్షులు పెన్మెత్స ఆంజనేయరాజు, పెదపుల్లేరు రూరల్ బ్యాంక్ మాజీ ఛైర్మన్ కలిదిండి సీతారామరాజు, నాయకులు కరిమెరక మల్లికార్జున, కమతం బెనర్జీ, రైతులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల వద్దే రేషన్ ఇప్పించండి

వైసిపి నేతలకు నివాసితుల వినతి

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక టిడ్కో ఇళ్ల సముదాయం వద్దే రేషన్ ఇప్పించాలని ఆ ఇళ్ల నివాసులు మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీని కోరారు. వారు ఇరువురు ఆదివారం ఆ ప్రాంతంలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు మాట్లాడుతూ డ్రెయినేజీ, తాగునీరు, శానిటేషన్ వంటి సమస్యలను నేతల దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై శేషుబాబు వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యలు వివరించారు. ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని, రోడ్లపై స్పీడు బ్రేకర్లు వేయాలని కోరారు. వీలైతే సచివాలయం ఏర్పాటు చేసి రేషన్ బియ్యం, పెన్షన్ ఇక్కడే ఇచ్చే ఏర్పాటు చేయాలని కోరారు. వారి వెంట చెన్ను విజయ్, గంటా నరేష్, బొడ్డు హరిలక్ష్మీ, పెద్దగాడి నాగరాజు, బెవర బాబీ, తాతపూడి సాయిరామ్, బ్రహ్మాజీ, పెచ్చెటి కృష్ణాజీ, దేవరపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.




కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న శేషుబాబు

యర్రా కుటుంబానికి ప్రముఖుల పరామర్శ

ప్రజాశక్తి - ఉండి

రాజకీయ దురంధరులు, మాజీమంత్రి యర్రా నారాయణస్వామి మరణం తీరని లోటని పలువురు ప్రముఖులు అన్నారు. ఆదివారం ఆయన స్వగ్రామం ఉప్పులూరులో నారాయణస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నారాయణస్వామి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కెఎస్.జవహర్, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు మాట్లాడుతూ నారాయణస్వామి జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పని చేసినప్పుడు జిల్లాను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఏ పదవి చేపట్టినా ఆ పదవికి వన్నె తెచ్చారని కొనియాడారు. సామాజికవేత్తగా, విద్యావేత్తగా ఎన్నో సేవలందించారన్నారు. గ్రామ సర్పంచి స్థాయి నుంచి రాజ్యసభ సభ్యుని వరకు ఎదిగినా ప్రతిఒక్కరితో ఎంతో హుందాగా ప్రవర్తించే వారని గుర్తు చేశారు. ఆయనకు చదువుపై ఎంతో ఆసక్తి ఉండేదని, గ్రామ సర్పంచిగా చేసే కాలంలోనే తన తల్లిదండ్రుల పేరిట గ్రామంలో పాఠశాలను స్థాపించారని గుర్తు చేశారు. అటువంటి మహోన్నత వ్యక్తి మరణం జిల్లాకు తీరని లోటని అన్నారు. నారాయణస్వామి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. యర్రా కుటుంబాన్ని పరామర్శించిన వారిలో తూర్పుగోదావరి జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్ బొర్రా హనుబాబు, తూర్పుగోదావరి జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ నామాన రాంబాబు, అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ మంతెన యోగేంద్రబాబు, టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, జనసేన నాయకులు కలవకొలను తులసి, డిసిసిబి మాజీ ఛైర్మన్ ముత్యాల వెంకటేశ్వరరావు (రత్నం), ఆనంద గ్రూప్ కంపెనీ ఛైర్మన్ విశ్వనాథరాజు, తాడేపల్లిగూడెం ఫుడ్‌ఫ్యాట్స్ ఛైర్మన్ ఓపి.గోయెంకా, డిఎన్ఆర్ కాలేజీ సెక్రటరీ గాదిరాజు బాబు, ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ రంగరాజు తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జవహర్

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు ప్రత్యేక వాహనాలపై బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. చిన్నారులు, పెద్దలు సముద్ర స్నానాలు చేసి సేదతీరారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సరదాగా గడిపారు.

గంగిశెట్టి కుటుంబానికి జెడ్‌పి ఛైర్మన్ పరామర్శ

ప్రజాశక్తి - వీరవాసరం

అభ్యుదయ భావాలకు ఆదర్శమూర్తి కదలి గంగిశెట్టి మృతి తీరని లోటని జిల్లా పరిషత్ ఛైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. గంగిశెట్టి కుటుంబ సభ్యులను, ఆయన కుమారుడు కదలి మృత్యుంజయను జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా గంగిశెట్టితో ఉన్న పరిచయాన్ని శ్రీనివాస్ గుర్తు చేసుకున్నారు. మనమడు అంటూ ఆప్యాయంగా పిలిచేవారన్నారు. నాడు సమస్యల పట్ల ఏ విధంగా పోరాడింది వివరించేవారని శ్రీనివాస్ తెలిపారు. ఆయన మృతి బాధాకరమన్నారు. ఆయనతో పాటు వైసిపి నాయకులు కోడి అప్పారావు, దొంగ వెంకటేశ్వరావు ఉన్నారు.

విద్యార్థులకు పెన్నులు అందజేత

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం మెంటేవారితోటలోని విజయ కనకదుర్గ బాలాత్రిపుర సుందరి దేవి అమ్మవారికి రెండు వేల పెన్నులతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఈ నెల మూడో తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షల్లో భాగంగా ఆదివారం ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈడిద నవీన్ కుమార్, సత్య భవాని దంపతులు, యాతం శ్రీనివాస్, నాగలక్ష్మి దంపతులు, జాలూరి పనస రామయ్య దంపతులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పెన్నులతో అలంకరణ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పెన్నులు అందించారు.

పేరంటాలమ్మ సన్నిధిలో పారిశ్రామికవేత్త నారాయణరెడ్డి

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని వెలివర్రు గ్రామ దేవత వీర పేరంటాలమ్మ 70వ జాతర మహోత్సవాల్లో చివరి రోజైన ఆదివారం భక్తులతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. ఉండి మండలానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ద్వారంపూడి నారాయణరెడ్డి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ కమిటీ ఛైర్మన్ మంతెన రంగరాజు, మాజీ ఛైర్మన్ కల్లేపల్లి సతీష్‌రాజు, ముదునూరి వీర్రాజు, గ్రామ మాజీ ఉపసర్పంచి మంతెన కొండరాజు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ద్వారంపూడి నారాయణరెడ్డి మాట్లాడుతూ తనకు ఘన స్వాగతం పలికిన ఆలయ కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. ఆలయ కమిటీ ఛైర్మన్ మంతెన రంగరాజు, మాజీ ఛైర్మన్ కల్లేపల్లి సతీష్‌రాజు మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామస్తుల సహకారంతో నిర్మిస్తున్న కళ్యాణ మండపం, గదుల నిర్మాణంలో ద్వారంపూడి నారాయణరెడ్డి పాత్ర కీలకమైందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రుద్రరాజు సంజీవరాజు, గొట్టుముక్కల జానకిరామరాజు, సానబోయిన దుర్గారావు, ఆలయ కమిటీ కార్యనిర్వాహక అధికారి రుద్రరాజు ఫణి కిషోర్ వర్మ పాల్గొన్నారు.

5న దళితవాడలో జోగయ్య పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - పాలకొల్లు

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షులు చేగొండి హరిరామజోగయ్య బడుగు బలహీన వర్గాలతో సఖ్యతను తెలిపేందుకు ఈ నెల ఐదో తేదీన ఆయన పుట్టినరోజు వేడుకలను పాలకొల్లులో దళితవాడలో నిర్వహించుకోనున్నారు. ఈ మేరకు జోగయ్య పిఆర్ఒ అంబటి విజయకుమార్ తెలిపారు. బడుగు బలహీన వర్గాల ప్రజలు యాచించే స్థితి నుంచి శాసించే స్థితికి రావాలని జనసేన కోరుతున్నట్లు జోగయ్య భావిస్తున్నట్లు తెలిపారు.

'పది' విద్యార్థులకు స్నాక్స్

ప్రజాశక్తి - పాలకొల్లు

జీవితంలో పరీక్షలు ఒక భాగమే కాని, పరీక్షలే జీవితం కాదని ఒకసారి ఫెయిల్ అయినా ఎవరూ కుంగిపోకుండా పట్టుదలతో మళ్లీ ప్రయత్నించాలని వాకర్స్ క్లబ్, పాలకొల్లు అధ్యక్షుడు తటవర్తి సుధాకర్ అన్నారు. పాలకొల్లు బ్రాడీపేట ఎవిఎస్ఎన్.మున్సిపల్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం స్టడీ అవర్‌లో చిరు ఆహారాన్ని క్లబ్ తరపున అందించారు. ఈ సందర్భంగా రూ.తొమ్మిది వేలను పాఠశాల హెచ్ఎం విష్ణుమూర్తికి అందించారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో పదో తరగతి ఒక కీలక మలుపు అని, ప్రతి విద్యార్థి సమయాన్ని వృథా చేయకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం ఆర్.విష్ణుమూర్తి అధ్యక్షత వహించగా క్లబ్ కోశాధికారి పోతుల ఉమా శంకరరావు, ఉపాధ్యక్షులు ధనాని శ్రీరామమూర్తి, ఉపాధ్యాయులు ఎం.సురేష్, ప్రసాదరాజు, కె.గోపీకృష్ణ పాల్గొన్నారు.

గుమ్ములూరులో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పోడూరు

మండలంలోని గుమ్ములూరులో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జనసేన పార్టీ ఆచంట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చేగొండి సూర్యప్రకాష్, పార్టీ జిల్లా జాయింట్ సెక్రటరీ రావిహరీష్‌బాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీష్ మాట్లాడుతూ జనసేన నాయకులు కొప్పినీడి శ్రీనివాసరావు ఈ చలివేంద్రం ఏర్పాటుకు సహకారం అందించారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు కడలి రాంబాబు, మండల అధ్యక్షులు గుడాల రాజేష్, జిల్లా ఉపాధ్యక్షులు వెంగళదాసు దానయ్య, జిల్లా సెక్రటరీ చిట్టూరి శ్రీనివాస్, పెనుగొండ మండల అధ్యక్షులు కొడవీటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం

ప్రజాశక్తి - గణపవరం

మండల కేంద్రమైన గణపవరంలో బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం క్రైస్తవ సోదరులు మట్టల ఆరాధన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 300 మంది క్రైస్తవ సోదరులు మట్టలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో జరిగిన ఆరాధన కార్యక్రమంలో బాప్టిస్ట్ సంఘ ఫీల్డ్ కౌన్సిల అధ్యక్షులు జి.డేవిడ్‌లివింగ్ స్టన్ ఆంధ్ర క్రైస్తవ వేదాంత కళాశాల ఆచార్యులు ఎస్.రోజ్‌నిర్మలకుమార్ దేవుడు సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపరులు ఎస్.ఏలేషు, పి.రత్నబాబు, కార్యదర్శి ఎస్.మోహన్‌రావు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని పాలపర్తివారిపేటలో, కొండావారిపాలెం, ఇంజేటివారిపాలెం, గోడవారిపేట, పాలకమ్మ చెరువు, రాజుగారితోట, నక్కావారిపాలెం, క్రీస్తు లూథరన్ దేవాలయాల్లో మట్టల ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నేరాలు - ఘోరాలు

క్రికెట్ బెట్టింగ్‌లో అప్పులపాలై వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - తణుకు

క్రికెట్ బెట్టింగ్‌లో అప్పులపాలైన వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం తణుకులో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని పైడిపర్రుకు చెందిన దుర్గాప్రసాద్ క్రికెట్ బెట్టింగ్‌లు ఆడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో గతంలో దుర్గాప్రసాద్ క్రికెట్ బెట్టింగ్‌లో దుర్గాప్రసాద్ చేసిన అప్పు రూ.1.60 లక్షలు తన తండ్రి తీర్చాడు. మళ్లీ రెండు రోజుల క్రితం ప్రారంభమైన ఐపిఎల్‌లో దుర్గాప్రసాద్ బెట్టింగ్‌లకు పాల్పడి అప్పులపాలయ్యాడు. దీంతో మనస్తాపానికి గురైన అతను రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆకివీడు

భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని కుప్పనపూడి శివారు శివపార్వతిపురం గ్రామానికి చెందిన తాళ్లూరి నరేష్ అతని భార్య నాగదివ్యను వేధింపులకు గురి చేస్తుండేవాడు. ప్రతి రోజు మద్యం తాగి వచ్చి అదనపు కట్నం కోసం వేధించేవాడు. ఈ వేధింపులు భరించలేని దివ్య ఆదివారం ఉదయం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు తల్లి సిరాల మంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సంజీవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఎంఇఒ శ్రీనివాసరావు, ఆచంట

ఆచంట : పదో తరగతి పరీక్షలకు ఆచంట మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఇఒ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఉజ్వల భవితకు ఉన్నత చదువులకు పదో తరగతి ఫలితాలే కీలకమన్నారు. ఇంటర్ పాలిటెక్నిక్, ఐటిఐ, పలు వృత్తి విద్యలు చదవటానికి పదో తరగతి ఫలితాలు ఆధారమన్నారు. పదో తరగతి విద్యార్థులు ఏకాగ్రతతో అస్త్రాలు సాధించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ఆచంట మండలంలో నాలుగు కేంద్రాల్లో మొత్తం 526 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. మండలంలోని ఎనిమిది ఉన్నత పాఠశాల, రెండు ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు నాలుగు కేంద్రాల్లో పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదే పాఠశాలకు చెందిన 114 మంది, ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు నలుగురు, ఆచంట, వేమవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు 58 మంది పరీక్షలు రాయనున్నారు. కొడమంచిలి ఉన్నత పాఠశాలలో 88 మంది విద్యార్థులు, పెనుమంచిలి 25 మంది, కరుగోరుమిల్లి 16 మంది, కోడేరు 36, హెూలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 46 మంది, కొడమంచిలి ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాయనున్నారు. వల్లూరు ఎంపీపాలెంలో 90 మంది, భీమలాపురం 49 మంది విద్యార్థులు వల్లూరు ఎంపీ పాలెంలో పరీక్షలు రాయనున్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి

జివి.రామకృష్ణంరాజు, వేటుకూరి సుబ్బరాజు జెడ్‌పి పాఠశాల హెచ్ఎం

కాళ్ల : పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి చేశామని మండలంలోని కలవపూడి గ్రామంలో వేటుకూరి వెంకట సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాదిరాజు వెంకట రామకృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ప్రతిరోజు సబ్జెక్టుల వారీగా సబ్జెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. పాఠశాలలో రూ.1.25 లక్షలతో సైకిల్ షెడ్ నిర్మించినట్లు చెప్పారు. ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు, ఆయన సోదరుడు మంతెన పెద నరసింహమూర్తిరాజు తల్లిదండ్రుల పేరుతో సభా వేదికను సుమారు రూ.10 లక్షలతో నిర్మాణ పనులు చేపట్టేందుకు ముందుకు రావడం అభినందనీయమని చెప్పారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

ఎంఇఒ బి.వినాయకరావు

భీమవరం రూరల్ : ఈ నెల మూడో తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఎంఇఒ బి.వినాయకరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఈ నెల మూడో నుంచి ఏప్రిల్ 18వ తేదీ వరకు జరగనున్న పది పరీక్షలకు భీమవరం పట్టణ కేంద్రం నుంచి 2739 మంది విద్యార్థులు, మండల కేంద్రం నుంచి 647 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఈ పరీక్షలకు పట్టణంలో 12 సెంటర్లు, మండల గ్రామాల్లో ఐదు సెంటర్లు కేటాయించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. తాగునీరు, ఒఆర్ఎస్‌తో పాటు ప్రతి కేంద్రంలోనూ మెడికల్ కిట్లతో పాటు, ఒక ఎఎన్ఎం, ఆశావర్కర్లు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షణ ఉంటుందన్నారు. విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ప్రతియేటా 'పది' విద్యార్థులకు తప్పని తిప్పలు

దూరప్రాంతాల్లో పరీక్షా కేంద్రాలు

ప్రజాశక్తి - ఆచంట

పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయంలో ప్రతి ఏటా కరుగోరుమిల్లి, పెనుమంచిలి, కోడేరు విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు. ఈ మూడు పాఠశాలల విద్యార్థులు సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొడమంచిలి కేంద్రంలో పరీక్షలు రాయాల్సి వస్తుంది. భీమలాపురానికి చెందిన విద్యార్థులు కూడా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న వల్లూరు ఎంపీపాలెంలో పరీక్షలు రాయాల్సి ఉంది. ఈ మార్గాల్లో బస్సు ఆటో సౌకర్యం లేకపోవడంతో సైకిల్‌పై లేదా నడుచుకుంటూ కేంద్రానికి చేరుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటివరకు విద్యార్థులంతా పగలు, రాత్రి తేడా లేకుండా పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. తీరా పరీక్షలు రాసే కేంద్రాలు దూరంగా ఏర్పాటు చేయడంతో కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవడమే పెద్ద పరీక్షగా మారింది. ఉదయం 9:30 గంటలకు పరీక్షా సమయం కాగా అరగంట ముందుగా చేరుకోవాలంటే ప్రయాణం ప్రమాదకరంగా మారుతుంది. విద్యార్థులను పరీక్షలకు పంపే తల్లిదండ్రులు పరీక్ష ఎలా రాశారన్న దానికంటే కేంద్రానికి ఎలా చేరారన్న ప్రశ్నతోనే మదన పడుతున్నారు. పరీక్షా కేంద్రాలకు వెళ్లే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించే సౌకర్యం కల్పించింది. మండలంలో ఎక్కువ భాగం బస్సులు తిరగని ప్రాంతాల్లో కేంద్రాలు ఏర్పాటు చేయడంతో అయోమయ పరిస్థితి నెలకొంది. ఆచంట మండలంలో కరుగోరుమిల్లి, పెనుమంచిలి, కోడేరు ఆరు కిలోమీటర్ల దూరం ప్రయాణించి కొడమంచిలి కేంద్రానికి వెళ్లి పరీక్షలు రాస్తుంటారు.

గణపవరంలో ఆరు కేంద్రాలు ఏర్పాటు

గణపవరం : మండలంలో ఆరు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంఇఒ పి.శేషు తెలిపారు. మండలం నుంచి 847 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

2275 మంది పరీక్షలకు హాజరు

పాలకొల్లు : పదో తరగతి పరీక్షలకు పాలకొల్లు పట్టణం, మండలం నుంచి పది సెంటర్లలో 2275 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పాలకొల్లు పట్టణంలోని ఏడు సెంటర్లలో మొత్తం 1274 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. శివదేవుని చిక్కాలలో ఒకటి, లంకలకోడేరు జెడ్‌పి హైస్కూల్లో రెండు కేంద్రాల్లో 1001 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో హైకోర్టు నాయమూర్తి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మావుళ్లమ్మను హైకోర్టు న్యాయమూర్తి దుప్పల వెంకటరమణ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. వారిని ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో సత్కరించారు. దేవస్థానం ఇఒ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ, ఆలయ ధర్మకర్తలు రామాయణం సత్యనారాయణ, ముత్యాల వెంకట రామారావు, గోపిశెట్టి విజయలక్ష్మి, తాళ్లపూడి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వాతావరణంలో మార్పులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలో ఆకాశం ఆదివారం ఉదయం నుంచి మబ్బులతో నిండి ఉంది. వాతావరణం చల్లబడటంతో జనం సేదతీరారు. పెనుమంట్ర, మార్టేరు, మాముడూరు, సోమరాజు ఇల్లింద్రపర్రు, గరువు, మల్లిపూడి, జుత్తిగ, ఆలమూరు, భట్లమగుటూరు, ఓడూరు, నెలమూరు, వెలగలేరు తదితర గ్రామాల్లో గాలులు వీచాయి.

సత్యనారాయణకు జెడ్‌పి ఛైర్మన్ కవురు పరామర్శ

ప్రజాశక్తి - యలమంచి

మండలంలోని నార్నిమెరక గ్రామ సర్పంచి భర్త వలవల సత్యనారాయణ ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది స్వగృహానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్మన్, వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కవురు శ్రీనివాస్ సత్యనారాయణను ఆదివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు వల్లభు నరసింహరావు, ఎంపిటిసి సభ్యులు ఇసుకపల్లి శ్రీధర్‌వర్మ, శీలం రామారావు, ఆరిమిల్లి లక్ష్మణరావు, మట్లపాలెం ఎంపిటిసి సభ్యులు కడలి సునీత నరసింహరావు, లక్ష్మిపాలెం సర్పంచి మహేష్, కాజా తూర్పు సర్పంచి పాలంకి శ్రీను, ఇనుకొండ రవి, మేడపాడు ఎంపిటిసి సభ్యులు దేగల సూర్యప్రభ పాల్గొన్నారు.

విషప్రయోగం జరగలేదు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కెపిపాలెం బీచ్‌లో ఈ ఏడాది ఫిబ్రవరిలో కలకలం రేపిన కోతుల మృతికి ఏ విధమైన విషప్రయోగం జరగలేదని ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎస్‌కె ఫిరోజ్ తెలిపారు. ఆ సమయంలో కోతుల మృతదేహాలను చూసిన గ్రామస్తులు అధికారులకు సమాచారం అందించారు. అధికారులు సంఘటన ప్రాంతానికి చేరుకుని కోతుల మృతదేహాల నుంచి నమూనాలను సేకరించి విజయవాడలోని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. అక్కడ పరీక్షలు నిర్వహించిన అధికారులు ఏ విధమైన విష నమూనాలు లేనట్లు ధ్రువీకరించారని ఫిరోజ్ తెలిపారు.

డ్రెయినేజీల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నియోజకవర్గంలో డ్రెయినేజీల అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో డ్రెయినేజీ శాఖ అధికారులతో మాట్లాడారు. కొవ్వాడ అన్నవరం డ్రెయినేజీని ప్రక్షాళన చేసేందుకు రూ.5 లక్షల నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. గునుపూడి సౌత్ డ్రెయిన్ ప్రక్షాళనకు రూ.రెండు కోట్ల నిధులను మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు పంపించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో 17 మైనర్ డ్రెయిన్ల అభివృద్ధికి రూ.1.20 కోట్ల నిధులను మంజూరు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డిఇ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎఇ లీలప్రసన్న పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఆసరా చెక్కు అందజేత


ప్రజాశక్తి - గణపవరం

వైఎస్ఆర్ ఆసరా మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పిప్పరలో రాజశ్రీ ఫంక్షన్‌హాలులో ఆదివారం నిర్వహించిన వైఎస్ఆర్ ఆసరా చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 16 గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలకు 559 సంఘాలకు రూ.4,64,77,385 చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, గణపవరం ఎంపిపి దండు వెంకటరామరాజు, జెడ్‌పిటిసి సభ్యులు దేవవరపు సోమలక్ష్మి, సూర్య బలిజ రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రరాజు కుటుంబానికి యోగేంద్రబాబు పరామర్శ

ప్రజాశక్తి - ఉండి

పెదపుల్లేరు గ్రామ సహకార సంఘం మాజీ ఛైర్మన్ కలిదిండి రామచంద్రరాజు (పెదపుల్లేరు రామం) శనివారం మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్, వైసిపి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యువజన సంఘం అధ్యక్షులు మంతెన యోగేంద్రబాబు ఆదివారం పరామర్శించి రామచంద్రరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం యోగేంద్రబాబు మాట్లాడుతూ కాస్మో పొలిటన్ క్లబ్ వ్యవస్థాపకులుగా కలిదిండి రామచంద్రరాజు సుపరిచితులన్నారు. తనను నమ్ముకున్న వారికి ఎల్లప్పుడూ అండగా ఉండి ధైర్యాన్ని ఇచ్చేవారన్నారు. అటువంటి వ్యక్తిని కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. వైసిపి సోషల్ మీడియా పశ్చిమగోదావరి జిల్లా కో ఇన్‌ఛార్జి పాటూరి శ్రీనివాస దొరబాబు మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావడానికి కలిదిండి రామచంద్రరాజు ఎంతో ప్రోత్సాహం ఇచ్చేవారన్నారు. పార్టీలకు అతీతంగా అందరితో ఎంతో సఖ్యంగా ఉండేవారన్నారు. కలిదిండి రామచంద్రరాజు కుటుంబానికి గొల్లలకోడేరు ఉప సర్పంచి శ్రీనివాస్ వర్మ, తిరుపతిరాజు, కలిదిండి భాస్కర్ రాజు, కూనపరాజు రంగరాజు సానుభూతి తెలిపారు.



రామచంద్రరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యోగేంద్రబాబు

పట్టణాభివృద్ధికి విష్ణురాజు సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణ అభివృద్ధికి బివి.రాజు విద్యాసంస్థలు చేస్తున్న సేవలు అభినందనీయమని, ఈ సేవలను వెలకట్టలేమని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. బివి.రాజు పార్కు పునరుద్ధరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ముందుగా మహిళా కళాశాలను విష్ణురాజు స్థాపించారన్నారు. పలు ప్రాంతాలను దత్తత తీసుకొని వాటిని అభివృద్ధి చేయడంతో పాటు భీమవరానికి మణిహారంగా విష్ణు విద్యా సంస్థలను తీర్చిదిద్దారన్నారు. పార్కును అన్ని వసతులతో సుందరీకరణ చేయడంతో పాటు ఐదేళ్ల పాటు పార్కు నిర్వహణ బాధ్యతను కూడా విష్ణు రాజు తీసుకున్నారన్నారు. పట్టణ అభివృద్ధికి సహకరిస్తున్న విష్ణు రాజును వాకర్స్ అసోసియేషన్‌తో పాటు ప్రజలు కూడా సత్కరించడం ఎంతో సంతోషమన్నారు. విష్ణురాజు మాట్లాడుతూ మన పార్కుగా బాధ్యత తీసుకొని ప్రతిఒక్కరూ నడుచుకోవాలన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని వెల్లడించారు. దేశంలోనే విద్యాపరంగా భీమవరంలోనే ఎక్కువ ర్యాంకులు సాధిస్తున్న విద్యార్థులు ఉన్నారన్నారు. అనంతరం విష్ణురాజును ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్, స్వర్ణ భారతి ట్రస్ట్ ఛైర్మన్ దీపా వెంకట్, మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, బిజెపి రాష్ట్ర నాయకులు భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ కొటికలపూడి గోవిందబాబు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, వైసిపి పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, జెసిఎస్ త్రీ టౌన్ కన్వీనర్ చెల్లబోయిన సూర్యప్రకాష్, గంటా సుందర్‌కుమార్, కట్రెడ్డి సీతారామయ్య పాల్గొన్నారు.

దాతల సహకారం మరువలేనిది

ప్రజాశక్తి - కాళ్ల

ఉత్సవాలకు దాతలు, భక్తులు అందించిన సహకారం మరువలేనిదని మాజీ ఎంపిపి వెంకట మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని బొండాడలో కీర్తిశేషులు కందుల లక్ష్మణస్వామి, లక్ష్మీతులసమ్మ దంపతులతో ప్రతిష్ఠించిన భద్రాద్రి సీతారామచంద్ర స్వామి 30వ వార్షిక కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా శ్రీరామ ఉత్సవ కమిటీ సభ్యులు 102 మందిని ఆదివారం సత్కరించారు. కాళ్ల మండలంలో పలు గ్రామాలకు చెందిన దాతలు, భక్తులు శ్రీరామ ఉత్సవ కమిటీ సభ్యులుగా ఉన్న 102 మందికి మాజీ ఎంపిపి కందుల వెంకట మల్లికార్జునరావు ఆధ్వర్యంలో సత్కారించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ ఈ ఉత్సవాలు నిర్వహించడానికి ఆర్థిక సహకారంతో పాటు ఘనంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించారన్నారు. ఈ ఉత్సవాల నిర్వహణకు సహకరించిన ప్రతి దాతకు రుణపడి ఉంటానన్నారు. ఈ నెల 3న సీతారామచంద్రస్వామి చిత్ర విచిత్ర వేషధారణతో, బాణసంచా కాల్పులతో ఊరేగింపు ఉంటుందన్నారు. కోలాటం, కోయడాన్స్ కాళికాదేవి ట్రూప్‌లతో, లక్ష్మీదుర్గ తీన్‌మార్‌తో స్వామి వారికి ఊరేగింపు ఉంటుందన్నారు. ఈ నెల 4న అఖండన సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు.

వరిధనంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని వరిధనం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మొదటి మూడు సంవత్సరాల్లో అనేక మంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. 2019 సమయానికి నాలుగు శాతం నిరుద్యోగ సమస్య ఉన్న రాష్ట్రం ఈ రోజు 7.7 శాతానికి పెరిగిందన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో పెద్ద ఎత్తున ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తే జగన్మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత ఉద్యోగం, ఉపాధి లేకుండా చేశారన్నారు. పిల్లల భవిష్యత్తు కోసం, భావితరాల ప్రయోజనాల కోసం చంద్రబాబు నాయుడును వచ్చే ఎన్నికల్లో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి కోడి విజయభాస్కర్, యూనిట్ ఇన్‌ఛార్జి రాయిప్రసాద్, పార్టీ ప్రెసిడెంట్ పోతుల సూరిబాబు, మండల మహిళా అధ్యక్షురాలు ద్రాక్షరావు జ్యోతి, బొక్క సూరిబాబు, వర్ధనపు వీలషన్‌రాజు, మామిడిశెట్టి ఏసు, వర్ధనపు కాంతారావు, దిరిశాల శ్రీను, వాసు పాల్గొన్నారు.

పార్టీకి కార్యకర్తలే బలం : టిడిపి జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పార్టీకి కార్యకర్తలే బలమని టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో టిడిపి పట్టణ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి అధ్యక్షతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ టిడిపి పట్టణ కార్యవర్గ కమిటీలో పది మంది సభ్యులను ఎంపిక చేసినట్లు తెలిపారు. కమిటీ అధ్యక్షునిగా ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, ఉపాధ్యక్షులుగా లంకి శ్రీనివాస్ (చిన్ని), ప్రధాన కార్యదర్శిగా గూడూరి సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా గోల్తి పాండురంగచారి (విశ్వబ్రాహ్మణ), ఎండి అస్లాంభాష (ముస్లింమైనారిటీ), నేదునూరి గంగాధర్ (రజక), కార్యదర్శులుగా బేతనబట్ల పద్మ (బ్రాహ్మణ), సారిక ఆంజనేయులు (నాయిబ్రాహ్మ), బొత్స వెంకటరమణ (రెల్లి), కోశాధికారిగా కొల్లిపాకుల దుర్గాప్రసాద్ (వైశ్య) నియమించినట్లు చెప్పారు. టిడిపి జిల్లా కార్యదర్శి పాలి ప్రసాద్, టిడిపి నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, పట్టణ మాజీ కన్వీనర్, రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరవల్లి చంద్రశేఖర్ మాట్లాడారు. తొలుత ఇటీవల మృతి చెందిన యర్రా నారాయణస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మామిడిశెట్టి ప్రసాద్, మైలబత్తుల ఐజాక్ బాబు, మాదాసు కనకదుర్గ, సయ్యద్ నసీమ బేగం, చల్లబోయిన సుబ్బారావు, గోపాలకృష్ణంరాజు, వీరవల్లి శ్రీనివాస్, వెంకన్న, పృథ్వీశంకర్, కడలి వాసు, బొడ్డు మోహన్, చల్లబోయిన గోవింద్ పాల్గొన్నారు.

ఏలూరుపాడులో నరేష్, పవిత్ర సందడి

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని ఏలూరుపాడు గ్రామంలో పర్యటించడం సొంత గ్రామానికి వచ్చినట్లు ఉందని సినీ నటులు వికె.నరేష్, పవిత్ర లోకేష్ అన్నారు. తమ సంస్థలో ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్‌గా పనిచేస్తున్న కన్నయ్య కుమార్తె తేజస్విని రజస్వల ఆహ్వానం మేరకు గ్రామానికి వచ్చినట్లు నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు ఆలయాలను సందర్శించామ న్నారు. అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బిఆర్.అంబ ేద్కర్, దాట్ల చినరామచంద్రరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్ర మంలో గ్రామ సర్పంచి భూపతిరాజు జగ్గరాజు, దాట్ల సెక్యూరిటీ వాసు(స్కాట్లాండ్), వైసిపి గ్రామ అధ్యక్షులు దాట్ల శ్రీనివాసరాజు, మంతెనవెంకట రవివర్మ, డి.శ్రీనివాసరాజు, రమణ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికలతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి దెందుకూరి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు పర్యవేక్షించారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి- తణుకు

పట్టణానికి చెందిన పలువురు బిజెపి కార్యకర్తలు పట్టణ మాజీ అధ్యక్షులు చుండూరి శేషాద్రి శాస్త్రి, మాజీ కౌన్సిలర్ ఎం.రాధాకృష్ణ ఆధ్వర్యంలో టిడిపిలోకి చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, టిడిపి పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ, ఎఎంసి మాజీ ఛైర్మన్ బసవ రామకృష్ణ, సప్ప రాజు పాల్గొన్నారు.